2 కిలోమీటర్లు.. 20 నిమిషాలు

● అడుగడుగునా గుంతలతో అవస్థల ప్రయాణం

● విస్తరణకు నోచుకోని సూరయ్యపల్లి-రచ్చపల్లి రహదారి

న్యూస్‌టుడే, మంథని

అసలే ఇరుకు.. ఆపై గుంతలు.. మధ్యలో దారిపైకి చేరుతున్న వరద.. వెరసి రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణానికి 20 నిమిషాల సమయం పడుతోంది. మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటేనే వాహన చోదకులు హడలిపోతున్నారు. వాహనాలు గుంతల్లో పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పది రోజుల్లో గుంతలు పూడ్చివేస్తామని సింగరేణి జీఎం హామీ ఇచ్చి 20 రోజులవుతున్నా అమలుకు నోచుకోలేదు.



రహదారిపై గుంతలు

రోడ్డుపైకి వాగు నీరు

● సింగరేణి సంస్థ పదేళ్ల కిందట మంథని మండలం బిట్టుపల్లి శివారులో అసైన్డ్ భూమిని సేకరించింది. రచ్చపల్లి, అక్కేపల్లి, లద్నాపూర్ గ్రామాల ప్రజలు నిర్వాసితులుగా మారగా రచ్చపల్లి పునరావాస కాలనీ పేరిట ఇళ్లు నిర్మించి, వసతులు కల్పించింది.

● సూరయ్యపల్లి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలనీ వరకు గతంలో మట్టి రోడ్డు ఉండేది. పునరావాసకాలనీ నిర్మాణ సమయంలో రూ.2 కోట్లతో ఒక వరుస తారు నిర్మించారు.

● మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లెల్లపల్లి గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తారు.

● పునరావాస కాలనీ నిర్మాణానికి ముందు నిత్యం 20 వాహనాలు నడిచేవి. ఏడాది కిందట ఖమ్మంపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన అందుబాటులోకి రావడంతో నిత్యం వందలాది వాహనాలు నడుస్తున్నాయి.

● ఈ మార్గంలో జనగలంత వాగు కాలువ నీటితో పాటు బిట్టుపల్లి పెద్దచెరువు మత్తడి నీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

● అసలే ఒక వరుస రహదారి కాగా పలు చోట్ల మలుపులు ప్రమాదకరంగా మారాయి.



ఛిద్రమైన తారు

కాజ్‌వే వద్ద వంతెన నిర్మాణంతో పాటు రహదారిని రెండు వరుసలుగా నిర్మించాల్సి ఉంది.

ప్రభుత్వానికి అప్పగించని సింగరేణి

సింగరేణి భూ నిర్వాసితుల కోసం సంస్థ యాజమాన్యం ఈ రహదారిని నిర్మించింది. పంచాయతీరాజ్ లేదా ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించకపోవడంతో రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు కావడం లేదు. పునరావాస కాలనీ కోసం నిర్మించినందున సింగరేణి సంస్థ మరమ్మతులు చేపట్టాలని రచ్చపల్లి గ్రామస్థులు కోరుతున్నారు. ఒక వరుస దారి కావడంతో ఎదురుగా వాహనం వస్తే వెళ్లడం కష్టమవుతోందని, వాహనాల రద్దీకి అనుగుణంగా రెండు వరుసలుగా విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

ఫెర్టిలైజర్ సిటీ, న్యూస్‌టుడే: సంకటహర చతుర్థి సందర్భంగా ఫెర్టిలైజర్ సిటీలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి మూలవిరాట్టుకు విశేష పూజలతోపాటు అభిషేకాలు చేపట్టారు. పరిసర కాలనీల్లోని భక్తులు తరలివచ్చి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

గాడిన పడనున్న బడి

● కొత్త ఉపాధ్యాయుల రాకతో మెరుగుపడనున్న బోధన



న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్, జ్యోతినగర్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా అడుగులు పడుతున్నాయి. బోధనలో ప్రమాణాలు పెంచేందుకు ఖాళీలను భర్తీ చేస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో విషయ నిపుణుల కొరత లేకుండా, ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతపడకుండా సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేశారు. పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించారు. ఖాళీగా ఉన్న పోస్టులు జీవోలో భర్తీ కావడంతో సర్కారు బడులలో ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

170 ఖాళీలు

జిల్లాలో మొత్తం 516 ప్రభుత్వ పాఠశాలలుండగా 28 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2,275 మంది ఉపాధ్యాయులు బోధిస్తుండగా పలు చోట్ల ఖాళీలున్నాయి. సుమారు 170 ఖాళీలుండగా వీటిలో 120 ఎస్జీటీలు, 50 స్కూల్ అసిస్టెంట్ పోస్టులున్నాయి. వీటిని భర్తీ చేస్తే బోధనకు పూర్తి స్థాయిలో ఇబ్బందులు తీరతాయి.

పర్యవేక్షణ మెరుగు

పాఠశాల విద్యలో కీలకమైన ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉండటం బోధనపై ప్రభావం చూపుతోంది. గతంలో ఒక్కో ఎంఈవో మూడు నుంచి నాలుగు మండలాల బాధ్యతలు చూసేవారు. ఏళ్లుగా రెగ్యులర్ అధికారుల నియామకం లేక సీనియర్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌ఛార్జులుగా వ్యవహరించారు. జిల్లాలో 14 మండలాలకు కలిపి అయిదుగురు ఎంఈవోలు మాత్రమే పని చేశారు. ప్రస్తుతం అన్ని మండలాల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులకి నోడల్ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. బోధన, పిల్లల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీపై పర్యవేక్షణ మెరుగుపడనుంది.

కొత్తగా 73 మంది చేరిక

● జిల్లాలోని వివిధ కేటగిరీల్లో 93 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా తాజా నియామకాల్లో 73 మంది చేరారు.

● ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రం వంటి ప్రధాన విషయాలకు సంబంధించి స్కూల్‌అసిస్టెంట్ పోస్టులు భర్తీ అయ్యాయి.

● కొన్ని పాఠశాలలకు కొత్తగా పోస్టులు మంజూరు చేసి ఉపాధ్యాయులను కేటాయించారు.

సర్దుబాటుతో కొరత తీరింది

జిల్లాలో ఉపాధ్యాయుల కొరత లేకుండా సర్దుబాటు చేశాం. కొత్త ఉపాధ్యాయుల రాకతో పాఠశాలల్లో బోధన మెరుగవుతుంది. నోడల్ అధికారుల నియామకంతో పర్యవేక్షణ పెరిగింది. **-మాధవి, జిల్లా విద్యాధికారి**

అభివృద్ధి పనులకు భూమిపూజ

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి పురపాలిక పరిధిలో రూ.1.49 కోట్ల టీఎఫ్ఐడీసీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విజరమణారావు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. పట్టణంలోని 19, 23 వార్డులలో ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, మురుగునీటి వ్యవస్థను బాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ ఛైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

క్రీడా ప్రాంగణం.. నామమాత్రం



శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలిగించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు కొన్నిచోట్ల బోర్డులకే పరిమితమవుతున్నాయి. కాల్వశ్రీరాంపూర్ మండలం మడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా భవనం వద్ద నామమాత్రంగా తెలంగాణ క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డు ఏర్పాటు చేసి వదిలేశారు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా తగిన ఏర్పాట్లు చేయాలని యువకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కాల్వశ్రీరాంపూర్

గన్నీ సంచులు సిద్ధం




వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు గన్నీ సంచులను అధికారులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. గతంలో గన్నీ సంచుల కొరతను దృష్టిలో ఉంచుకొని ఈ సీజన్ ముందే తగిన జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. మంథని సివిల్ సప్లై గోదాంకు ఇప్పటికే 1.68 లక్షల గన్నీ సంచులు సరఫరా అయ్యాయని.. మరిన్ని త్వరలోనే రానున్నాయని గోదాం అధికారి అజయ్ పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, మంథని

చోరీలు పరిపాటి.. రికవరీ ఏపాటి?

● ఘటన సమయంలో హడావుడి.. ఆపై విస్మరణ


● పోయిన సొమ్ము రాబట్టడంలో పోలీసుల నిర్లక్ష్యం



ఈనాడు, కరీంనగర్

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 2022లో అన్ని రకాల చోరీలు కలిపి 248 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ ఎఫ్ఐఆర్‌లు నమోదైనవి. కేసు కాకుండా బాధితులు వెనుదిరిగినవి మరో 200 వరకుంటాయి. 2023లో 330 చోరీలు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటివరకే ఆ సంఖ్య 300 దాటింది. గతేడాది రూ.2 కోట్ల విలువైన సొత్తు చోరీకి గురి కాగా పోలీసులు రూ.94,91,786ను మాత్రమే తిరిగి స్వాధీనం చేసుకోగలిగారు.

✦ రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతేడాది నమోదైన 327 కేసుల్లో 158 మాత్రమే ఛేదించారు. రూ.1.58 కోట్లు పోగా రూ.59.70 లక్షలు బాధితులకు ఇప్పించగలిగారు. రూ.కోటి వరకు రికవరీ కాలేదు. అంతకుముందు ఏడాది(2022)లో 114 ఘటనల్లో దొంగలు పట్టుబడ్డారు. 121 కేసుల అతీగతి లేదు. రూ.45.04 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది 200 వరకు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.



చోరీ సొత్తు రికవరీ శాతం

	2022	2023
కరీంనగర్	49.43	44.89
జగిత్యాల	35.34	32.15
పెద్దపల్లి	13.00	21.00
రాజన్న సిరిసిల్ల	32.35	38.24

● జగిత్యాల జిల్లాలో మూడు నెలలుగా చోరీలు పెరిగాయి. ఇళ్లతో పాటు చిన్న ఆలయాలు, దుకాణాల్లోకి చొరబడుతూ దొంగలు అందిన కాడికి దోచుకెళ్తున్నారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు 302 చోరీలు జరిగాయి. సగటున రెండు రోజులకో కేసు నమోదైంది. సిరిసిల్ల జిల్లాలోనూ అడపాదడపా చోరీ ఘటనలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వెయ్యికి పైగా కేసుల్లో దొంగలు చేతివాటం చూపారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చోరీలు పెరుగుతున్నాయి. పాత, కొత్త నేరస్థులపై నిఘా పెట్టండి. సొత్తు రికవరీలో మీరెందుకు వెనుకబడ్డారు? నేరగాళ్ల పట్టివేతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి. చోరీలను నిలువరించండి.

-ఈ ఏడాది ఆగస్టు 19న కరీంనగర్‌లో నిర్వహించిన నేర సమీక్షలో డీజీపీ జితేందర్

✦ పెద్దపల్లి జిల్లాలో 2022లో 679 చోరీలు జరిగాయి. బాధితులు రూ.4.47 కోట్లు పోగొట్టుకోగా రూ.59.21 లక్షలు మాత్రమే తిరిగి ఇప్పించగలిగారు. గతేడాది 725 ఎఫ్ఐఆర్‌లు నమోదై రూ.1.99 కోట్లు పోగా రూ.40.99 లక్షలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల జిల్లాలో గతేడాది 113.2 తులాల బంగారు ఆభరణాలను, 1508 తులాల వెండి ఆభరణాలను బాధితులకు అందించగలిగారు. మరో 80 తులాల ఆభరణాలను రికవరీ చేయాల్సి ఉంది.



● ఈ ఏడాది జులై 7న పట్టపగలే అలుగునూరులో రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. తాళం పగులగొట్టి లోనికి చొరబడిన దొంగలు 8 తులాల బంగారు ఆభరణాలు సహా రూ.46 వేలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం సభ్యులు ఇప్పటివరకూ దొంగలను గుర్తించలేదు. రెండు, మూడు రోజులు హడావుడి చేసి ఆ తర్వాత వదిలేశారు. బాధితులు మాత్రం ఠాణా చుట్టూ తిరుగుతున్నారు.

పోయింది ఎక్కువ.. ఫిర్యాదులో తక్కువ

చోరీ ఘటనల్లో బాధితులు ఎక్కువ మొత్తం పోగొట్టుకున్నా పోలీసులు వారితో తక్కువ మొత్తాన్ని ఫిర్యాదుల్లో రాయిస్తున్నారు. రూ.లక్ష కన్నా ఎక్కువ ఉండకుండా చూస్తున్నారు. పెద్ద కేసులపై దృష్టి సారిస్తూ చిన్న చోరీ ఘటనల విషయంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఆలయాల్లో దొంగతనాలు జరిగినప్పుడు తక్కువ మొత్తంలో సొత్తు పోయినట్లు నమోదు చేస్తున్నారు. రికవరీ అయినప్పుడు పూర్తిగా ఇప్పిస్తామని బాధితులను ఒప్పించి ఫిర్యాదులు రాయిస్తున్నారు. ఇక రూ.వేలల్లో పోయిన సొత్తుకైతే కేసులే నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి.

రైతు భరోసా అమలు చేయాలని ఆందోళన



అంతర్గాంలో నినాదాలు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు చందర్ తదితరులు

పెద్దపల్లి, పాలకుర్తి (అంతర్గాం), న్యూస్‌టుడే: ఎన్నికల్లో ప్రకటించిన రైతు భరోసా, ఆంక్షలు లేని రుణ మాఫీని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. భారాస రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్దపల్లిలో రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు ఆందోళనకారులను శాంతింపజేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. అంతర్గాంలో మాజీ ఎమ్మెల్యే, భారాస జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. భారాస నాయకులను పోలీసులు ఠాణాకు తరలించారు. మాజీ ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని వివరించారు.



పెద్దపల్లిలో రాస్తారోకో చేస్తున్న భారాస శ్రేణులు

కోతుల పట్టివేతకు ప్రత్యేక బృందం

మంథని, న్యూస్‌టుడే: మంథని పట్టణంలో కోతుల బెడద నివారణకు మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. కోతులను పట్టుకోవడానికి నెల్లూరు నుంచి ప్రత్యేక బృందాన్ని పిలిపించారు. రెండు ఇనుప బోన్లు ఏర్పాటు చేసి వాటిలో అరటిపండ్లు వేస్తూ మూడు రోజులుగా కోతులను పట్టుకుంటున్నారు. ఇటీవల మంథనిలో కోతుల దాడులతో జనం బెంబేలెత్తారు. చాలామంది గాయపడి చికిత్స పొందారు. ఇళ్లలోకి కోతులు చొరబడి సామగ్రిని చిందరవందర చేయడంతో స్థానికుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. సమస్య తీవ్రత దృష్ట్యా పురపాలిక తగిన చర్యలు తీసుకోవడానికి పూనుకొంది. తాజాగా చేపట్టిన కోతుల బెడద నివారణ చర్యలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో కోతిని పట్టుకున్నందుకు రూ.350 చొప్పున చెల్లిస్తున్నామని.. పట్టుకున్న కోతులను చెన్నూరు ప్రాంతంలోని అడవుల్లో వదులుతున్నారని ఇన్‌ఛార్జి కమిషనర్ మనోహర్ పేర్కొన్నారు.



మంథని తమ్మిచెరువు కట్టలో కోతులు పడుతున్న బృందం

సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా

క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమంటున్న మిల్లర్లు

న్యూస్‌టుడే, హుజూరాబాద్

ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లు సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా అంటున్నారు. క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారు. మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ.. ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతుండగా మిల్లర్ల మెలికతో సన్నధాన్యం సేకరణ చిక్కు సమస్యగా మారనుంది.



దిగుబడి ఇలా..

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సీజన్‌లో 11.75 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. 20.59 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాకొచ్చారు. ఇందుకోసం 1,360 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈసారి 31 రకాల సన్నధాన్యాన్ని పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మునుపెన్నడూ లేని విధంగా వానాకాలం సీజన్‌లో అత్యధిక శాతం సన్నాలు సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో 3,90,967 ఎకరాల్లో సన్నాలు సాగైంది. కరీంనగర్ జిల్లాలో 2,48,623 మెట్రిక్ టన్నులు, జగిత్యాలలో 1,72,150 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 3.44 లక్షల మెట్రిక్ టన్నులు, రాజన్న సిరిసిల్లలో 28,457 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకొచ్చారు. మొత్తంగా 7.93 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని ప్రత్యేక కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అంతా సిద్ధం చేశారు. సన్నాలకు కేంద్రం క్వింటాకు రూ.2,320 మద్దతు ధర చెల్లిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ కలిపి రూ.2,820 చొప్పున కొనుగోలు చేయనుంది. దొడ్డు ధాన్యంతో వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ)కు వెళతాయి. కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేశాక వచ్చే బియ్యాన్ని వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు, సంక్షేమ వసతి గృహాలకు ఉపయోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కానీ సన్న ధాన్యం మిల్లింగ్‌కు మిల్లర్లు ససేమిరా అనడంతో ఈ సమస్య కొలిక్కి వచ్చిన తర్వాతే సన్నధాన్యం కొనుగోలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలు సడలించాలని రారైస్ మిల్లర్స్ అసోయేషన్ అధ్యక్షుడు తనుకు సురేశ్ తదితరులు కోరుతున్నారు.

ఇదీ సమస్య

✦ సాధారణంగా దొడ్డు రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాకు 67 కిలోల బియ్యం వస్తాయి. అదే సన్న రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే 57 కిలోలకు మించి బియ్యం రావని మిల్లర్లు అంటున్నారు.

✦ దొడ్డు, సన్నాలకు చెందిన ఏ రకం ధాన్యం మిల్లింగ్ చేసినా క్వింటాకు రూ.67 కిలోల బియ్యం సీఎంఆర్ కింద అప్పగించాలని ప్రభుత్వం అంటుందని చెబుతున్నారు.

✦ సన్నరకాలను తీసుకొని మిల్లింగ్ చేస్తే క్వింటాకు 10 కిలోల బియ్యం తక్కువగా వస్తుందని, ఈ లోటును ఎవరు భరిస్తారని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.

✦ పైగా 17 శాతం తేమ ఉన్న సన్నరకం ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటే 20 రోజుల్లో రంగు మారిపోయే ప్రమాదం ఉందని, ఇవే బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే బియ్యం తీసుకునే సమయంలో నాణ్యత లేదంటూ అధికారులు కొర్రీలు పెడితే తాము నష్టపోతామని వాపోతున్నారు.

✦ అందుకే తేమ నిబంధనను 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని.. సన్న బియ్యం సరఫరాలో క్వింటాకు రూ.300 పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు.

✦ క్వింటాకు ఎన్ని కిలోల బియ్యం వచ్చినా తీసుకునేలా నిబంధన సడలించాలని కోరుతున్నారు.

✦ దీంతోపాటు 20 ఏళ్లుగా మిల్లింగ్ ఛార్జీలు పెంచకపోవడంతో అనేక సమస్యల తమను వేధిస్తున్నాయని అంటున్నారు.

✦ రారైస్ క్వింటాకు రూ.30 చెల్లిస్తున్నారని, పెరిగిన విద్యుత్తు ఛార్జీలు, కార్మికుల కూలీలు కలిపితే తమకు అసలే గిట్టుబాటు కావడం లేదంటున్నారు.

సమగ్ర కుల గణనకు కార్యాచరణ

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ బీసీ గణన చేపట్టేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణకు సిద్ధమైంది. సర్వేకు సంబంధించిన విధి విధానాలు వెలువడగానే ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రధానంగా వివిధ శాఖల సమన్వయంతో ముందుకెళ్లాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులు మినహా ఇతర శాఖల సేవలను ఇందుకోసం వినియోగించనుంది.

వివిధ శాఖల సమన్వయం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందు బీసీ కుల గణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనేక తర్జన, భర్జన అనంతరం సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ వివరాల గణనతోపాటు బీసీ కులగణన సర్వే చేయనున్నారు. నిరంతరం క్షేత్ర స్థాయిలో ఉండే ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించనున్నారు. 150 ఇళ్లకు ఒక యూనిట్‌గా తీసుకొని సర్వే చేపట్టేందుకు బాధ్యతలు అప్పగించనున్నారు. గ్రామ, వార్డు స్థాయిలో సమగ్రంగా ఇది కొనసాగనుంది. కేంద్ర ప్రభుత్వం 2011లో నిర్వహించిన జనగణన తర్వాత ఈసారి కొత్త విధానంతో రూపకల్పన చేసి కుల గణనకు శ్రీకారం చుట్టనున్నారు. గతంలో భారాస ప్రభుత్వం సమగ్ర సర్వే చేసినా ఉపయోగం లేకుండా పోయింది. సర్వేను 60 రోజుల్లో పూర్తి చేయడం ద్వారా బీసీ గణనతోపాటు ఇతర వివరాలను వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఉమ్మడి జిల్లా కేంద్రంగా తీసుకొని అవసరమైన పటాలు, వివరాలు సేకరించి సర్వే సిబ్బందికి అప్పగించనున్నారు.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది: కులగణనకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని, కలెక్టర్ల ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడతామని అధికార వర్గాలు తెలిపాయి. ప్లానింగ్ శాఖ సర్వే కార్యక్రమం సమన్వయం చేస్తోంది.

ఎస్సారెస్పీ 12 గేట్ల ద్వారా నీటి విడుదల

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామ సాగర్ ప్రాజెక్టు 12 గేట్లను తెరచి 37,488 క్యూసెక్కుల నీటిని ఆదివారం సాయంత్రం గోదావరిలోకి విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 13,566 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఎగువన వర్షాలతో వరద పెరిగే అవకాశమున్నందున దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి అన్ని కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ పథకానికి కలిపి ఇన్‌ఫ్లోతో సమానంగా ఔట్‌ఫ్లో కొనసాగిస్తున్నారు.

దిగువ మానేరు జలాశయం నుంచి..

తిమ్మాపూర్ : మధ్య మానేరు జలాశయం నుంచి ఎల్‌ఎండీకి ఇన్‌ఫ్లో వస్తుండడంతో నీటి పారుదల శాఖ అధికారులు ఆదివారం రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఎల్‌ఎండీకి 4800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. రెండు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 4277 క్యూసెక్కులను వాగులోకి వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో ప్రస్తుతం 24.034 టీఎంసీల నీరున్నట్లు వారు చెప్పారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టుకు క్రీడాకారుల ఎంపిక



సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డితో క్రీడాకారులు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. స్పోర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.మహేందర్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా నుంచి 375 మంది బాలబాలికలు ఈ పోటీలకు హాజరయ్యారన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆదిత కుమారస్వామి, ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం బాధ్యులు సూర్యప్రకాశ్, సంతోష్, మొయినుద్దీన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


అజరామరం.. ఆ త్యాగం

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

న్యూస్‌టుడే, గోదావరిఖని

పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించుకోవడం వెనుక సైనిక వీరోచిత పోరాటం దాగుంది. 1959 అక్టోబరు 21న భారత్-చైనా సరిహద్దున సియాచిన్ ప్రాంతంలోని భూ భాగాన్ని ఆక్రమించేందుకు చైనా రక్షణ బలగాలు యత్నించాయి. ఆ సమయంలో డీఎస్పీ కరమ్‌సింగ్ ఆధ్వర్యంలో పంజాబ్‌కు చెందిన 21 మంది జవాన్లు అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. అక్సాయిచిన్ ప్రాంతంలోని హాట్‌స్ప్రింగ్ వద్ద జరిగిన పోరాటంలో పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. వీరుల రక్తం పారిన ఆ ప్రదేశాన్ని పవిత్ర స్థలంగా భావించి ఏటా అన్ని రాష్ట్రాల పోలీసులు సందర్శించి నివాళులర్పిస్తున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం అక్టోబరు 21ని పోలీసు అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు.

'కనిపించే మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపాలైతే కనిపించని నాలుగో సింహమేరా పోలీస్' అని అంటాడు ఓ సినిమాలో కథానాయకుడు.. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ముందుంటున్న రక్షకభటుల త్యాగాలకు ఈ మాట చక్కగా నప్పుతుంది.. సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా నిద్రించడానికి కంటి మీద కునుకు లేకుండా సేవలందిస్తున్న పోలీసుల త్యాగం అజరామరం.. విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన అమరులను స్మరించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యం..



మందుపాతరకు బలి

అది 1991 డిసెంబరు 19. హుస్నాబాద్ మండలం రామవరం. ఆర్టీసీ బస్సులో చోరీ జరిగిందన్న సమాచారంతో ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్‌విల్సన్ తమ బృందంతో కలిసి అక్కడికి చేరుకున్నారు. విచారణ పూర్తయిన తర్వాత ఆర్టీసీ బస్సులో తిరిగి హుస్నాబాద్ బయలుదేరారు. రామవరం సమీపంలో మావోయిస్టులు పేల్చిన మందుపాతరకు సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్‌విల్సన్, సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కశ్మీరీలాల్‌తో పాటు ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు, అయిదుగురు ఆర్టీసీ అధికారులు, నలుగురు గ్రామస్థులు మృతి చెందారు. మరో 9 మంది కానిస్టేబుళ్లు గాయపడ్డారు.



జాన్‌విల్సన్



యాదగిరి

■ 1996 సెప్టెంబరు 7న రాత్రి రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్‌లోని టెలిఫోన్ ఎక్స్ఛేంజిని మావోయిస్టులు దహనం చేశారు. ఈ ఘటనపై విచారణ కోసం 8న ఉదయం కానిస్టేబుల్ కె.మోహన్‌రావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మావోయిస్టులు ల్యాండ్‌మైన్ పేల్చారు. ఈ ఘటనలో ఆయనతో పాటు మరో కానిస్టేబుల్ ఎం.డి.నజీర్ ప్రాణాలు కోల్పోయారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రాణ త్యాగం



గోదావరిఖని ఏఆర్ సబ్ హెడ్‌క్వార్టర్‌లో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఎస్.సంజీవరెడ్డికి 1999 సెప్టెంబరు 20న మహాముత్తారం మండలంలో రీపోలింగ్ భద్రత విధులు అప్పగించారు. ముందస్తుగా వెళ్లి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంది. సంజీవరెడ్డి ఇంట్లో శుభకార్యం ఉన్నా విధులపై నిబద్ధతతో తన బృందంతో వెళ్లారు. దొబ్బలపాడు వద్ద రోడ్డును తనిఖీ చేస్తుండగా మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఆ ఘటనలో సంజీవరెడ్డితో పాటు కానిస్టేబుళ్లు మీస రవీందర్, కె.బాపు, బి.లక్ష్మీరాజం మృతి చెందారు. ప్రశాంత పోలింగ్ లక్ష్యంగా బందోబస్తు విధులకు ధైర్యంగా వెళ్లిన సంజీవరెడ్డి సాహసాన్ని ఇప్పటికీ పోలీసులు గుర్తు చేసుకుంటారు.



ఆయన సేవలు చిరస్మరణీయం

మల్హర్ మండలం రుద్రారంలో బ్యాంకును దహనం చేసినట్లు సమాచారం రావడంతో 1993 జూన్ 14న కొయ్యూరు ఎస్‌ఐ ఎం.ఎ.సుభాన్ పోలీసు బృందంతో ట్రాక్టరులో బయల్దేరారు. సుభాష్‌నగర్ నుంచి ఎడ్లపల్లి వైపు వెళ్తుండగా కల్వర్టు వద్ద మావోయిస్టులు ల్యాండ్‌మైన్ పేల్చారు. ఈ ఘటనలో ఎస్‌ఐ సుభాన్‌తో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు దుర్మరణం చెందారు. సుభాన్ త్యాగానికి గుర్తుగా 2019 అక్టోబరు 21న కమాన్‌పూర్ ఠాణా ఎదురుగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇలాంటి పోలీసు త్యాగధనుల విగ్రహాలను ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల ఏర్పాటు చేసి వారి సేవలను స్మరించుకుంటున్నారు.



సుభాన్

■ జగిత్యాల జిల్లా హబ్సీపూర్ ప్రాంతంలో మావోయిస్టు దళం ఉందన్న సమాచారంతో 1991 సెప్టెంబరు 10న పోలీసు బృందం అక్కడికి చేరుకుంది. మావోయిస్టుల కాల్పుల్లో జగిత్యాల రూరల్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేసిన మోబిన్ అక్కడికక్కడే మృతి చెందారు.

సమాజ రక్షణలో సాంకేతిక దన్ను

■ అమరుల త్యాగాలు, ఎదురవుతున్న సవాళ్లతో పాఠాలు నేర్చిన పోలీసు శాఖ అనేక సంస్కరణలు అమలు చేస్తోంది.

■ శాంతిభద్రతల పరిరక్షణలో ఎదురవుతున్న ఒడుదొడుకులను తట్టుకునేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చింది.

■ ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా క్షణాల్లో సమాచారం అందేలా ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం 100 డయల్‌ను వినియోగంలోకి తీసుకొచ్చింది.



పోలీసు యాప్స్, టోల్‌ఫ్రీ నెంబర్లు

■ సీసీ కెమెరాలు, ఫోన్ యాప్‌లు, టోల్‌ఫ్రీ నెంబర్లతో ప్రజల్లోకి వెళ్తున్న పోలీసు శాఖ ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా ప్రజలకు సేవలందిస్తోంది.

■ కంట్రోల్ రూం నుంచే శాంతిభద్రతలను పర్యవేక్షించే స్థాయికి చేరుకుంది. మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రతకు స్మార్ట్‌ఫోన్లలో యాప్‌లు రూపొందించింది.

■ అవాంఛనీయ ఘటనలు జరిగినపుడు పెట్రో కార్, మొబైల్ పార్టీలు, 100 డయల్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది.

■ స్వీయ భద్రతతో పాటు ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసు శాఖ ప్రత్యేకత చాటుకుంటోంది.

ఇంటి స్థల వివాదం.. అన్నను హత్య చేసిన తమ్ముడు

మల్లాపూర్, న్యూస్‌టుడే: ఇంటి స్థల వివాదంలో అన్నను తమ్ముడు హతమార్చిన దారుణ ఘటన మల్లాపూర్ మండలం ఒబులాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒబులాపూర్ గ్రామానికి చెందిన పల్లెపు సాయిలు(34)తో అతడి తమ్ముడు చందుకు మధ్య కొన్నేళ్లుగా ఇంటి వద్ద స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. పాత గొడవలను దృష్టిలో పెట్టుకొన్న తమ్ముడు అన్నను హతమార్చాలని పథకం రచించాడు. ఆదివారం మధ్యాహ్నం సాయిలు గోదావరి తీరంలో ఒంటరిగా ఉన్నట్లు తెలుసుకున్న చందు అక్కడికి చేరుకొని మెడపై తల్వార్‌తో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయిలు తల, మొండెం వేర్వేరుగా ఉన్నట్లు గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు చందు పరారీలో ఉండటంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. హత్యా ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



సాయిలు

ఉపాధి లేక నేత కార్మికుడి ఆత్మహత్య



సంపత్

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు నెలలుగా పని లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తీవ్ర మనస్తాపానికి గురై ఓ నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సిరిసిల్లలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం బీవైనగర్‌కు చెందిన ఆడెపు సంపత్ (60), మాలతి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలు చేశారు. చిన్న కొడుకు అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద ఓ గదిలో సంపత్, మాలతి ఉంటున్నారు. నాలుగు నెలలుగా ఉపాధి లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, పది రోజుల క్రితం మాలతి కుమార్తె ఇంటికి వెళ్లింది. చేయడానికి పని లేకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ బలవన్మరణం



సంగీత

వీణవంక, న్యూస్‌టుడే: ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గువ్వల సంగీత(33) ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డట్లు వీణవంక ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సంగీత భర్త కొండయ్య పది సంవత్సరాల క్రితం మృతి చెందారు. వీరికి కూతురు కిరణ్మయి ఉంది. సంగీత నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చొప్పదండిలో విధులు నిర్వహిస్తున్నారు. రెండు నెలలుగా జ్వరంతో బాధ పడుతూ తీవ్ర అనారోగ్యానికి గురై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఆదివారం ఉదయం ఉరి వేసుకున్నారు. దీంతో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి కిరణ్మయి అనాథగా మారింది. మృతురాలి తల్లి మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

నదిలో మునిగి సీతంపేట వాసి మృతి

జమ్మికుంట, న్యూస్‌టుడే: ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన పోతన వేణుగోపాల్(38) కర్ణాటకలోని రాయచూరు జిల్లాలో కృష్ణా నదిలో మునిగి మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజేంద్రం-సరస్వతి దంపతుల కుమారుడు వేణుగోపాల్ ఈ నెల 17న దత్తాత్రేయస్వామిని దర్శించుకునేందుకు రాయచూరు వెళ్లాడు. కృష్ణానదిలో స్నానం చేసేందుకు దిగుతూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. నది పక్కనే బ్యాగు ఉండటంతో పరిసర ప్రాంతవాసులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి బ్యాగు వేణుగోపాల్‌దిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ నెల 19 ఘటనా స్థలానికి 40 కి.మీ దూరంలో జాలర్లకు వేణుగోపాల్ మృతదేహం కనిపించింది. వేణుగోపాల్ మృతితో గ్రామంలో విషాదం చోటు చేసుచేసుకుంది. ఆదివారం మృతదేహాన్ని సీతంపేటకు తీసుకుస్తున్నట్లు కుటుంబీకులు చెప్పారు.



వేణుగోపాల్

ఠాణా ఎదుట ఆత్మహత్యాయత్నం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: చోరీ కేసులో అనుమానితుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పెద్దపల్లి ఠాణా ఎదుట జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. పురపాలిక మాజీ ఛైర్మన్ ఎలువాక రాజయ్య శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి బస్సులో వచ్చి పెద్దపల్లి కమాన్ వద్ద సన్నిహితుడి కోసం నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు రాజయ్యపై దాడి చేసి అతడి చేతిలోని బ్యాగును లాక్కెళ్లారు. ఈలోగా అక్కడికి చేరుకున్న సన్నిహితుడితో కలిసి రాజయ్య ఆటోను వెంబడించారు. ఓ చోట వారిని పట్టుకునే యత్నంలో ఆటోను డ్రైవర్ వేగంగా వెనక్కి తిప్పి వెళ్లిపోయాడు. అందులో వెళ్తున్న వారు తలోవైపు పరుగు తీశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పెట్రోలింగ్ సిబ్బంది అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఠాణాకు తరలించారు. ఆదివారం ఉదయం ఆటో డ్రైవర్ రెహమాన్ అక్కడికి చేరుకొని.. రాత్రి జరిగిన ఘటనతో తనకు సంబంధం లేదంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పోలీసులు అడ్డుకొన్నారు. ఈ విషయమై ఎస్సై లక్ష్మణ్‌రావును వివరణ కోరగా విచారణ జరుగుతున్న క్రమంలో పెట్రోల్ పోసుకొని కేసును తప్పుదారి పట్టించేందుకు యత్నించడం సరికాదన్నారు. మరోవైపు ఆదివారం ఉదయం రాజయ్య ఇంటి ముందు బ్యాగు ప్రత్యక్షం కావడం గమనార్హం.



రెహమాన్



కర్రల వంతెనపై కష్టాల యానం

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి నుంచి పోతారం వెళ్లే చెరువు వద్ద ఇటీవలి వర్షాలకు మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. ఇక్కడ వంతెన కోసం గతంలో నిధులు మంజూరు చేసినా గుత్తేదారు పనులు ప్రారంభించలేదు. దీంతో గ్రామస్థులు, వ్యవసాయదారులు, గొర్ల కాపరులు కర్రలతో ఇలా తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై నుంచే వాహనదారులు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వంతెనతో పాటు పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ముత్తారం

రాజన్న ఆలయ గోపురానికి బంగారు తాపడం

దేవాదాయ శాఖ అధికారుల ప్రణాళిక

న్యూస్‌టుడే, వేములవాడ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ గోపురానికి బంగారు తాపడం చేయడానికి దేవాదాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఆలయానికి చెందిన బంగారు నిల్వలు గోపురానికి బంగారు తాపడం చేసేందుకు సరిపోతాయా? లేదా అనే అంశంపై సమీక్షించిన అనంతరం అధికారులు ఓ అంచనాకు రానున్నట్లు తెలుస్తోంది.

రాజన్నను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. స్వామివారిని దర్శించుకున్నవారు వివిధ రకాల కానుకలను సమర్పిస్తారు. ఆలయంలో జరిగే ఉత్సవాల సందర్భంగా లక్షల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీరిలో కొందరు బంగారం, మరి కొందరు వెండిని కానుకలుగా సమర్పిస్తుంటారు. ప్రస్తుతం ఆలయానికి చెందిన బంగారం 95 కిలోలు, వెండి 4,800 కిలోలు ఉంది. బంగారు తాపడంతో ఆలయానికి కొత్త శోభ సంతరించుకోనుంది.

గతంలోనే ప్రతిపాదన

రాజన్న ఆలయ గోపురానికి బంగారు తాపడం చేయాలని గతంలోనే ఆలయ అధికారులు, అప్పటి ఆలయ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానానికి నిధులు సమకూర్చారు. అయితే అంచనాలు పెరిగిపోవడంతో ఆ నిధులు సరిపోవని తిరిగి వెనక్కి పంపించారు. దీంతో అప్పటి నుంచి ఇది పెండింగ్‌లో ఉండిపోయింది.



రాజన్న ఆలయం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి

ఆలయ గోపురానికి బంగారు తాపడం చేసేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఎంత బంగారం అవసరమవుతుందనేది ముందుగా అంచనా వేస్తారు. ప్రస్తుతం ఆలయానికి ఉన్న బంగారం నిల్వల ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తరవాత బంగారు తాపడం ప్రక్రియ మొదలవుతుంది. **- వినోద్‌రెడ్డి, ఈవో, రాజన్న ఆలయం, వేములవాడ**



సహకారంతో అన్నీ సాధ్యమే

కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు



జ్యోతి వెలిగించి భారతి రాష్ట్ర మహాసభలను ప్రారంభిస్తున్న కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు

చింతకుంట (కరీంనగర్ కొత్తపల్లి), న్యూస్‌టుడే: సహకార సంఘాలు నిజాయతీ, నిబద్ధతతో పని చేయాలని, సహకారంతోనే ఏదైనా సాధించవచ్చని కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో చింతకుంట సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార భారతి తెలంగాణ శాఖ నాలుగో రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజేశ్వర్‌రావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో సహకార సంఘాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, వీటికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చేయూత అందించాల్సిన అవసరముందన్నారు. సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంఘం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తోందని, రాబోయే రోజుల్లో మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలో ప్రధాన వక్త ఆయాచితుల లక్ష్మణరావు, సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యాలమడుగు శంకరయ్య, జాతీయ కార్యదర్శి నందినిరాయ్, రాష్ట్ర నాయకులు కుమారస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, జూలపల్లి

? కోనరావుపేట గ్రామంలోని ఎస్సీకాలనీ నుంచి హనుమాన్ ఆలయం వరకు మురుగు నీటి కాలవ నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది.
- స్థానికులు

✔ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.- **శ్రీకాంత్, గ్రామ కార్యదర్శి**


నెత్తిన బోనమెత్తిన ఎమ్మెల్యే విజయరమణారావు

చందపల్లిలో పోచమ్మ బోనాలు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి పురపాలిక పరిధిలోని చందపల్లిలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామంలో జరిగిన బోనాల శోభాయాత్రలో ఎమ్మెల్యే విజయ రమణారావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అమ్మవారి బోనాలు నెత్తిన ఎత్తుకున్నారు. పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యావంతుల ఓటు నమోదు ప్రక్రియ చేపట్టాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టాలని నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొంతల రాజేశ్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. రానున్న ఎన్నికల కోసం పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకునే విధంగా పార్టీ నాయకులు అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

కష్టపడిన కార్యకర్తలకే కమిటీలో చోటు

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కష్టపడిన కార్యకర్తలకు ఇందిరమ్మ కమిటీ నియామకాల్లో చోటు కల్పించాలని మంత్రి శ్రీధర్‌బాబు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులకు సూచించినట్లు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ నియోజకవర్గ మండలాల పార్టీ అధ్యక్షులతో మినిస్టర్ క్వార్టర్స్‌లో శనివారం మంత్రి సమావేశం నిర్వహించారన్నారు. గ్రామ ప్రత్యేకాధికారి, కార్యదర్శి, ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, మరో ముగ్గురికి కమిటీలో చోటు కల్పించనున్నారని తెలిపారు. అక్రమాలు, అవినీతికి పాల్పడితే సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారని చెప్పారు. మహదేవ్‌పూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, పార్టీ అధ్యక్షులు రోడ్డ బాపు, వైనాల రాజు, ఆయిలి ప్రసాద్, దొడ్డ బాలాజీ, వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, గుండబోయిన చిన్నన్న, పక్కల సదువలి, అక్బర్ ఖాన్, బడితల రాజయ్య పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: ఆల్ ఎంప్లాయీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన 'మన ఊరు- మన జ్యోతి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సొసైటీ వ్యవస్థాపకుడు లింగమల్ల శంకరయ్య అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఆదివారం 'మన ఊరు- మన జ్యోతి' కార్యక్రమంలో భాగంగా ఉద్యోగుల ఆత్మీయ సన్నాన కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 10న ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాళేశ్వరం జోనల్ అధ్యక్షులు రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల సమ్మయ్య, మండల అధ్యక్షులు దాసరి రామచందర్, ఉమామహేశ్వర్, పాల రాజేశం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. అండర్- 19 బాలికల 600 మీటర్ల పరుగు పందెంలో మనీష, డిస్కస్‌త్రోలో రజిత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రధానాచార్యులు రాంచంద్రారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

అనారోగ్య కారణాలతో వివాహిత బలవన్మరణం


సంధ్య

పాలకుర్తి, న్యూస్‌టుడే: అనారోగ్య కారణాలతో మనోవేదనకు గురైన ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బసంత్‌నగర్ ఎస్సై స్వామి కథనం మేరకు... మండలంలోని పుట్నూరుకు చెందిన చెలిమేటి సంధ్య (40) గత సంవత్సర కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. సంధ్యకు భర్తతో పాటు కుమార్తె ఉన్నారు. మృతురాలి సోదరుడు మాడుగుల రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనదారుపై శునకాల దాడి

ధర్మారం: మండలంలోని నందిమేడారంలో శునకాల బెడద ఎక్కువైంది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న రాసూరి మల్లారెడ్డిని వెంబడించగా వాహనం అదుపుతప్పింది. ఆయనపై శునకాలు దాడిచేసి గాయపరిచాయి. పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి అనంతరం పెద్దపల్లికి పంపించారు.

గీత కార్మికుడికి గాయాలు



కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గర్రెపల్లి వెంకటేశ్ అనే గీత కార్మికుడు ఆదివారం గాయపడ్డారు. గీత వృత్తిలో భాగంగా ఈత చెట్టు ఎక్కి కల్లు దించే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డారు. అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని గౌడ సంఘం అధ్యక్షులు నగునూరి నరసయ్య, సింగం శ్రీనివాస్, సంఘం నాయకులు వెంగలి రాజయ్య, పొన్నం వెంకన్నలు పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

ముగ్గురు యువకుల అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: గోదావరిఖని కోల్‌బెల్ట్ వంతెన సమీపంలోని గంగానగర్ ఫ్లైఓవర్ వద్ద గంజాయితో వెళ్తున్న ముగ్గురు యువకులను ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. ఫ్లైఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై వస్తున్న సాజిద్‌బాబా, టి.అమన్, అక్షయ్‌లు తారస పడ్డారన్నారు. అనుమానం వచ్చి వారి వాహనాన్ని తనిఖీ చేయగా 70 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయితోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు..

గోదావరిఖని, న్యూస్‌టుడే: గంజాయి తాగుతున్న ఇద్దరిని గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి 80 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒకటో పట్టణ ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డి వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. స్థానిక గంగానగర్ మిలీనియం క్వార్టర్ల ప్రాంతంలో మహ్మద్ ఆసిఫ్, మహ్మద్ అక్రమ్‌లు సిగరెట్లలో గంజాయి నింపుకుని తాగుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేపట్టి వారిని అరెస్టు చేసినట్లు వివరించారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసిన వీరు రోజూ చెట్లపొదల్లో తాగుతున్నట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి కలిగి ఉన్నా, తాగినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.



ఏళ్లుగా సమస్యల తిష్ఠ

పెద్దపల్లిలో ప్రధానమైన అమర్‌నగర్ ప్రాంతంలో సమస్యలు వెంటాడుతున్నాయి. తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థలు దెబ్బతిన్నాయి. అభివృద్ధి పనులు ప్రతిపాదనలకే పరిమితం కావడంతో చివరికి వీధి దీపాల సమస్య కూడా తీరడం లేదు. అమర్‌చంద్ విగ్రహం నుంచి మజీద్ రోడ్డు వైపు మురుగు కాలువలు దెబ్బతిన్నాయి. పాత కాలువలు శిథిలమై పూడిపోయాయి. మజీద్ రోడ్డులో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. మిషన్ భగీరథ పైప్‌లైన్లు అస్తవ్యస్తంగా మారాయి. అమర్‌నగర్ నుంచి బండారికుంట వైపు, చింతల వాడవైపు తాగునీటి వృథా నిత్యకృత్యమైంది. సురభీ కాలనీలో మురుగు కాల్వల కష్టాలు తప్పడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యలకు శాశ్వత పరిష్కారమార్గాలు చూపాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, పెద్దపల్లి

ఆర్ఎస్‌టీపీఎస్‌కు అవార్డులు

జ్యోతినగర్(మార్కండేయకాలనీ), న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో నిర్వహించిన సీసీక్యూసీ-2024లో రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్(ఆర్ఎస్‌టీపీఎస్)ఉద్యోగుల బృందం మూడు బంగారు అవార్డులు సాధించినట్లు అధికారులు వెల్లడించారు. మైసూర్‌లో క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ వార్షిక చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ ప్రదర్శనలో 250 బృందాలు పాల్గొనగా ఇందులో రామగుండం నుంచి ఎన్టీపీసీ ధన్వంతరి బృందం, ఎన్టీపీసీ సీహెచ్‌పీ ఆపరేషన్ సృజన బృందం, డీఎం ప్లాంటు చింతన బృందాల తరఫున షౌకత్‌షేక్, కౌషల్ కుమార్‌యాదవ్, సుహాన్‌అలీ, ఎన్.సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, విష్ణు దేవరావ్, వెంకటేశ్వర్లు ప్రదర్శనలో చేపట్టిన అంశాలకు న్యాయనిర్ణేతలు అవార్డులు అందజేశారు.


అవార్డు స్వీకరిస్తున్న ఎన్టీపీసీ ఉద్యోగులు


కొలనూరు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


ఫెర్టిలైజర్ సిటీ: డి.ఎ.వి. పాఠశాల బృందం

ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

ఓదెల, పాలకుర్తి, ఫెర్టిలైజర్ సిటీ: ఓదెల మండలం కొలనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాలలో 1984 నుంచి 1994 వరకు పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఫెర్టిలైజర్ సిటీలోని డి.ఎ.వి. పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు గౌతమినగర్‌లో సమ్మేళనం నిర్వహించారు.


బసంత్‌నగర్‌లో..

బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తికి సన్మానం

గోదావరిఖని, న్యూస్‌టుడే: బదిలీపై వెళ్తున్న గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.మంజులను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జడ్జి గణేశ్, ఏజీపీ కిషన్ రావు, ఏసీపీ రమేశ్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు సతీష్, శ్రీనివాస్ తదితరులు న్నారు.


న్యాయమూర్తి మంజులను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా

యైటింక్లయిన్‌కాలనీ: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పెద్దపల్లి, కరీంనగర్ జట్లు విజయం సాధించాయి. కాలనీలోని డాక్టర్ అబ్దుల్ కలాం క్రీడామైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో పెద్దపల్లి, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి 170 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో 2-1 పాయింట్ల తేడాతో కరీంనగర్ జట్టుపై పెద్దపల్లి జట్టు విజయం సాధించగా బాలికల విభాగంలో పెద్దపల్లి జట్టుపై కరీంనగర్ జట్టు 2-1 పాయింట్ల తేడాతో విజయం సాధించింది.


విజేతలైన జట్లతో నిర్వాహకులు

సంక్షిప్తం

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని గ్రామ పంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే 48 గంటల దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సీపెల్లి రవీందర్, కాజా, లచ్చయ్య, శ్రీనివాస్, తిరుపతి, నరేష్, రాజయ్యలు పాల్గొన్నారు.

పార్టీ నుంచి సస్పెండ్

ధర్మారం: మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన ఎర్రం సంజీవ్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో పార్టీకి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నందుకు జిల్లా అధ్యక్షుడి ఆదేశాలతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

అప్రమత్తత అవసరం

కమాన్‌పూర్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమాన్‌పూర్ ఎస్సై ప్రసాద్ అన్నారు. కమాన్‌పూర్ ఠాణాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజల్లో అవగాహన పెంపొందించేలా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సామాజిక మాధ్యమాల్లో లింకులు పంపి మోసాలకు పాల్పడుతున్నారని.. చరవాణికి వచ్చే ఓటీపీలను అపరిచితులకు వెల్లడించవద్దని తెలిపారు.

గ్రూప్-I పరీక్షను వాయిదా వేయాలి

కాల్వశ్రీరాంపూర్: గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని జేఎన్టీయూ జేఏసీ కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఆయన మాట్లాడుతూ వాయిదా వేయాలని అభ్యర్థులు నిరసన కార్యక్రమం చేపడితే వారిపై పోలీసులు లాఠీఛార్జి చేయడం సిగ్గుచేటన్నారు.

మహ్మద్ ప్రవక్త జన్మదినం

ధర్మారం: ధర్మారంలోని మసీదులో మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రవక్త జీవిత విశేషాలను రిలీజియన్ ట్రస్టు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తీమహమ్మద్ ఫియాస్ మొయుద్దీన్ వివరించారు. ధర్మారం మసీదు కమిటీ అధ్యక్షుడు బాబా, గౌరవ అధ్యక్షుడు గౌస్, ఇమామ్ జాఫర్ ఆలం, సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం నేడు

ధర్మారం: నందిమేడారం సహకార సంఘం ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం ప్రారంభిస్తారని సహకార సంఘం సీఈవో మల్లేశం తెలిపారు. మండలంలోని పెరుకపల్లి, బంజరుపల్లి, ధర్మారం, నర్సింహులపల్లి, దొంగతుర్తి, రామయ్యపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు.

భాజపా సభ్యత్వ నమోదు

గోదావరిఖని పట్టణం: రామగుండం నగర పాలక 26వ డివిజన్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. భాజపా జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ క్యాతం వెంకటరమణ, డివిజన్ అధ్యక్షులు కోడూరి రమేశ్, భాస్కర్. నవీన్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు- కార్యవర్గాలు

గోదావరిఖని: వాటర్ ప్యూరిఫైడ్ అండ్ సర్వీస్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా తోడేటి శంకర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా శ్రీధర్, శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా రవి, సంయుక్త కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

కాల్వశ్రీరాంపూర్: బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన పొదిల సదానందం నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు.


కమాన్‌పూర్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ఎలిగేడులో..


కాల్వశ్రీరాంపూర్‌లో..

భారాస శ్రేణుల నిరసన

రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆదివారం భారాస శ్రేణులు జిల్లాలోని పలుచోట్ల నిరసనలు చేపట్టాయి. రహదారులపై రాస్తారోకో చేపట్టగా పోలీసులు విరమింపజేశారు.
- న్యూస్‌టుడే యంత్రాంగం


జూలపల్లిలో..


ఓదెలలో..


ధర్మారంలో..

వైద్య శిబిరానికి స్పందన

జ్యోతినగర్(మార్కండేయకాలనీ), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ అన్నారు. ఎన్టీపీసీ పీకేరామయ్యకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం సురేఖ ఆసుపత్రి యాజమాన్యం లక్కం భిక్షపతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సతీమణి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు శ్రీకాంత్, శ్రీలత, అజయ్‌కుమార్, అజయ్‌యాదవ్, స్పందన, కాంగ్రెస్ ఎన్టీపీసీ నాయకులు ఎండీ ఆసిఫ్‌పాషా, మడిపెల్లి మల్లేష్, లయన్స్‌క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

మార్కండేయకాలనీ, న్యూస్‌టుడే: గోదావరిఖని సంజయ్‌గాంధీనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలను ఆదివారం కూడా నడిపిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతమ్ ఆరోపించారు. విద్యార్థులను ఇంటికి పంపించారు. ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యం పాఠశాలను నడిపిస్తుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సాగర్, సునీల్, ప్రణీత్ తదితరులున్నారు.

మున్నూరుకాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం 3న

వేములవాడ, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లాలో వచ్చే నెల 3న జరిగే పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం గోడపత్రికను పట్టణంలోని మున్నూరు కాపు సంఘం ఆవరణలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముకాస నాయకులు పాల్గొన్నారు.

హరిపురంలో పారిశుద్ధ్యమేదీ?



ముత్తారం మండలం హరిపురం గ్రామంలో పారిశుద్ధ్యం లోపించినట్లు స్థానికులు చెబుతున్నారు. చెత్త సేకరించే ట్రాక్టర్ అయిదు నెలల క్రితం మరమ్మతుకు గురైందని తెలిపారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వేసిన బతుకమ్మలను కూడా శుభ్రం చేయలేదని వాపోతున్నారు. సమస్యపై కార్యదర్శి నవ్యను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగిస్తామని తెలిపారు.
- న్యూస్‌టుడే, ముత్తారం



ఉత్సాహంగా సమ్మేళనం

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి జీడీకే 6-ఎ గనిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు ఆదివారం ఒకే వేదికపై కలిశారు. 6-ఎ గనిలో కలిసి పనిచేసిన వారు వేరు వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. స్థానిక గంగానగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో కలుసుకుని నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.

సీనియర్ కార్మికులకు డిప్యుటేషన్లు ఇవ్వాలి



గోదావరిఖని, న్యూస్‌టుడే: సీనియర్ కార్మికులకు డిప్యుటేషన్లు కల్పించాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్మిక సంఘాల ఐక్య వేదిక సమావేశంలో మాట్లాడారు. జూనియర్ కార్మికులకు డిప్యుటేషన్లు కల్పిస్తూ సీనియర్లను విస్మరిస్తున్నారని, దీనిపై యాజమాన్యం దృష్టి సారించాలన్నారు. కంపెనీలో 40 సంవత్సరాలు సేవలందించిన కార్మికులను మారుపేర్ల కారణంగా ఇబ్బందులకు గురిచేస్తుందని, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించకుండా పక్కన పెట్టిందన్నారు. విజిలెన్సు విచారణల పేరుతో కాలయాపన చేస్తూ ఉద్యోగాలు కల్పించడం లేదని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రియాజ్‌అహ్మద్, ఐ.కృష్ణ, రాములు, నారాయణ, నరేశ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులపై భారాస మొసలి కన్నీరు'

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కాంట్రాక్టు కార్మికులపై భారాస నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, పార్టీ కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు వైనాల రాజు అన్నారు. ఆర్జీ-2 పరిధి ఓసీపీ-3లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పదేళ్లలో కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనాలకు నోచుకోలేదన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై నిరంతరం చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో తోట చంద్రయ్య, ఆరెల్లి కొమురయ్య, ముత్యాల శ్రీనివాస్, దాసరి శివ, తులసిరామ్, కాటం సత్యం, గాజుల శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

'వైద్యుల నిర్లక్ష్యం లేదు'

గోదావరిఖని, న్యూస్‌టుడే: రోగిని పరీక్షించిన వైద్యులు వెంటనే స్పందించి మెరుగైన వైద్యం కోసం పంపించేందుకు ఏర్పాట్లు చేసినా రోగి బంధువులే ఆలస్యం చేశారని ఆర్జీ-1 అధికార ప్రతినిధి కిరణ్‌బాబు తెలిపారు. శ్రీరాంపూర్‌లో ఓవర్‌మెన్‌గా పనిచేసే సురేశ్ ఛాతినొప్పితో శనివారం ఉదయం ఆస్పత్రికి వచ్చాడని, డ్యూటీ డాక్టర్ వైద్య పరీక్షలు చేసిన అనంతరం జనరల్ ఫిజీషియన్ పరీక్షించి గుండె సమస్య ఉందని గుర్తించారన్నారు. వెంటనే కరీంనగర్‌లో అన్ని సదుపాయాలు ఉన్న ఆస్పత్రికి రిఫర్ చేశారని తెలిపారు. రోగికి సంబంధించిన వారు ఈనెల 16న హైదరాబాద్‌లో వైద్యం చేసిన వైద్యుడితో మాట్లాడి రిఫరల్ వెళ్లడానికి నిరాకరించారని... వైద్యులు చెప్పినా వినకుండా ఆలస్యం చేశారని వెల్లడించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఆస్పత్రికి రిఫరల్ చేసిన వెళ్లలేదన్నారు. సాయంత్రం పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో అంబులెన్సులో హైదరాబాద్‌కు పంపిస్తున్న సమయంలోనే అతను చనిపోయాడని తెలిపారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఎక్కడా లేదన్నారు.


పుస్తకావిష్కరణలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, కేడం లింగమూర్తి, తదితరులు

సాహిత్యంతో ఉత్తమ సమాజ నిర్మాణం

హుస్నాబాద్, పెద్దపల్లి, న్యూస్‌టుడే: పుస్తకాలు చదవడం, రాయడం గొప్ప ఆలోచన విధానానికి పునాది అని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో స్థానిక స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత అన్నవరం దేవేందర్ రచించిన 'అంతరంగం' పుస్తకాన్ని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గులాబీల మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు పాలనాధికారి మాట్లాడుతూ.. ఉత్తమ సమాజ నిర్మాణానికి సాహిత్యం దోహదం చేస్తుందన్నారు. పుస్తక రచయిత అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ.. తాను ఇప్పటివరకు 20 పుస్తకాలు రాశానన్నారు. ఈ పుస్తకాన్ని 'ప్రతిపక్షం' పత్రిక సంపాదకుడు మహ్మద్ ఫజుల్ రహమాన్‌కు అంకితం ఇస్తున్నానన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, దక్షిణ భారత సమాఖ్య ఫిల్మ్ సొసైటీ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ పొన్నం రవిచంద్రను సన్మానించారు. పురాధ్యక్షురాలు రజిత, ఉపాధ్యక్షురాలు అనిత, సహకార సంఘం ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఎంఈవో మనీలా, న్యాయవాది చిత్తారి రవీందర్, స్ఫూర్తి అధ్యక్షుడు పందిల్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

